క్లుప్తంగా

రోడ్డు భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ

గోదావరిఖని: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక గంగానగర్‌లోని రామగుండం లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో రామగుండం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భీమ్‌సింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం మరణానికి కారణమని, హెల్మెట్ లేకుండా ప్రయాణం ప్రమాదకరమని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపొద్దని, వాహనంలో పరిమితికి మించి ప్రయాణించరాదని, ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని సూచించారు. లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం పరిసరాల పరిశుభ్రత, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితం నాశనం చేసుకోవద్దని ఆటపాట ద్వారా అవగాహన కల్పించారు. కళాకారులు స్నేహలత, శంకర్ గౌడ్, నర్సింగ్, వెంకటస్వామి, రవీందర్, సరిత, స్పందన, స్వప్న, స్పందన ఉన్నారు.

శుభ్రత పాటించాలి

సుల్తానాబాద్: ప్రతీ విద్యార్థి శుభ్రత పాటించాలని హెడ్‌నర్స్ రాణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం శారద, స్టాఫ్‌నర్స్ రేవతి, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటాచారి ఉన్నారు.

మంత్రి చొరవతో రేషన్ సమస్య పరిష్కారం

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్‌లో నెలకొన్న రేషన్ షాపు సమస్యను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో పరిష్కారమైందని ఎంపీటీసీ దొడ్డ గీతారాణి తెలిపారు. గ్రామంలో రెండు రేషన్ షాపుల్లో ఒక డీలర్ సస్పెండ్ కావడంతో రేషన్ సరుకు నిలిపివేశారు. రేషన్ సరుకులు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి రేషన్ సరుకును గ్రామంలోని మరో షాపు వచ్చేలా చర్యలు తీసుకోవడంతో సమస్య పరిష్కారమైందని ఎంపీటీసీ వివరించారు. రేషన్ సరుకు గ్రామానికి వచ్చేలా కృషిచేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటు నమోదును వినియోగించుకోవాలి

ముత్తారం: ఈనెల 20, 21న ముత్తారంలో ప్రారంభం కానున్న ఓటు నమోదు కార్యక్రమాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బండి రాజేశ్వరి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ముత్తారంలోని పోలింగ్ కేంద్రంలో శని, ఆదివారం నిర్వహించనున్న ఓటు నమోదులో కొత్తవారు, ఏమైనా తప్పులు, సవరణల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక వ్యక్తి ఒక చోట మాత్రమే ఓటుహక్కు కలిగి ఉండాలని రెండు చోట్ల కలిగి ఉండడం చట్టరీత్యా నేరమన్నారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష లేదా జరిమానా పడుతుందని వివరించారు.

ఉచితంగా డయాబెటిక్ పరీక్షలు



కోల్‌సిటీ: గోదావరిఖని గంగానగర్‌లో శుక్రవారం ఉచితంగా డయాబెటిక్ పరీక్షలతోపాటు బీపీ పరీక్షలను గోదావరిఖని ఉమెన్, శతాబ్ది లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర పేదలకు ఉచిత అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉమెన్స్ క్లబ్ అధ్యక్షురాలు బాలసాని పద్మాగౌడ్, ప్రధాన కార్యదర్శి ఏలేశ్వరం శ్రీలత, కోశాధికారి కంకణాల శ్రీదేవి, కర్క పద్మజ, మందల రమాదేవి, మూల విజయా రెడ్డి, తూముల రమాదేవితోపాటు శతాబ్ది లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కంకణాల ముకుంద రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలసాని స్వామిగౌడ్, కోశాధికారి శ్రీనివాస్‌రావు, తూముల రాజేశ్వర్ రావు, కాసర్ల సురేందర్‌రెడ్డి, చిర్రా సంజీవ్‌రెడ్డి, రాజేశ్ పాల్గొన్నారు.



పొంచి ఉన్న ప్రమాదం

ఓదెల: మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలోని లెవెల్ క్రాసింగ్ గేట్‌కు ఇరువైపులా ఉన్న ఇనుపరాడ్‌లు వంగి ప్రమాదకరంగా ఉన్నాయి. బోల్టులు లూజ్ కావడంతో ఇనుపరాడ్‌లు ఒరిగి ఉన్నాయి. ఎలాంటి ప్రమాదం జరగక ముందే రైల్వేసిబ్బంది వెంటనే మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.



కంపుకొడుతున్న గోదావరి

కోల్‌సిటీ: గోదావరి నదిలో స్నానం చేస్తే పుణ్యం లభిస్తుందని, పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. కానీ రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని గోదావరి నదిలో స్నానం చేస్తే అంటువ్యాధులు రావడం ఖాయం. పుష్కరఘాట్ వద్ద నీరు చెత్తాచెదారంతో కలుషితమైంది. దేవుళ్ల ఫొటోలు, ప్లాస్టిక్ కవర్లు, కొబ్బరి చిప్పలు, దుస్తులు తదితర వ్యర్థాలతో నదీనీరు కుళ్లి కంపుకొడుతోంది. దుర్వాసన వ్యాపిస్తోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

జ్యోతినగర్: విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా సంబంధిత విభాగం వారు వాటికి రక్షణ కల్పించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఎన్టీపీసీ రామగుండం రాజీవ్ రహదారిని ఆనుకుని కృష్ణానగర్‌కు వెళ్లే ప్రధాన దారిపక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, నర్రాశాలపల్లె రోడ్డుకు వెళ్లే ఓ బ్యాంకు ఎదుట ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణతో పాటు వాటిపక్కన ఉన్న బోర్డులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సాగు, తాగునీటికి శాశ్వత పరిష్కారం

ధర్మారం: కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి సాగునీటి నీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపించడంలో బీఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు విఫలమయ్యారని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం ధర్మారం మండలం నందిమేడారం గ్రామ రిజర్వాయర్ తూము గేట్‌ను ఆయన ఎత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం తలాపున గోదావరి జలాలున్నప్పటికీ ఈ ప్రాంత ప్రజలకు సాగునీటి సమస్య పరిష్కారానికి నోచుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన సీఎం వెం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

టనే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మార్గదర్శకాలు చేశారన్నారు. ఈక్రమంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారుల సమక్షంలో రిజర్వాయర్‌ను సందర్శించి తాగు, సాగు నీటి సరఫరాపై చర్చించినట్లు పేర్కొన్నారు. రైతులు సాగుచేసిన పంటలకు నష్టం వాటిల్లకుండా వారబందీ ప్రకారంగా నీటి విడుదల చేస్తామన్నారు. శ్రీరాంసాగర్ డీ–83 కెనాల్ ద్వారా పత్తిపాక గ్రామ రైతులకు సాగునీరు అందించేందుకు ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ శ్రీధర్, డీఈఈ నర్సింగరావులతో పాటు మాజీ ఎంపీపీ కదారి అంజన్న, కాంగ్రెస్ నాయకులు అరిగె లింగయ్య, చింతల జగన్మోహన్‌రెడ్డి, కొత్త నర్సింహం, మణిశర్మ, పాలకుర్తి రాజేశంగౌడ్, ఎదుల్లా అంజయ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని భారత ఆహారసంస్థ గిడ్డంగుల్లో శుక్రవారం అగ్నిమాపకశాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు సంభవించినపుడు అనుసరించాల్సిన పద్ధతులపై కనీస అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ సూచించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వస్తే, విద్యుత్‌షాట్ సర్క్యూట్‌తో, రోడ్డు, రైలు ప్రమాదాలు జరిగిన సమయాల్లో అనుసరించాల్సిన పద్ధతులను సులువుగా అర్థమయ్యేలా వివరించారు. ఎఫ్‌సీఐ మేనేజర్ చంద్రమోహన్‌తో పాటు



అవగాహన కల్పిస్తున్న అధికారి శ్రీనివాస్

అగ్నిమాపక సిబ్బంది మనోహర్, శ్రీనివాస్, సంతోష్, శ్రావణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

ఎక్సైజ్ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలి

గోదావరిఖనిటౌన్: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కల్తీ కల్లును అరికట్టలేని ఎక్సైజ్ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో నాయకులు ప్లకార్డులతో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ నిషేధిత డైజోఫామ్, అల్ఫాజలం, క్లోరోఫాం వంటి మత్తు కలిగిన విష పదార్థాలను కల్లులో కలిపి విక్రయిస్తున్న కల్లు సొసైటీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కల్లు డిపోలల్లో కల్తీ జరుగుతున్నా ఎక్సైజ్ సీఐ పర్యవేక్షణ లోపంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు. నాయకులు



నిరసన తెలుపుతున్న నాయకులు

సాదుల శివ, ఆసాల నవీన్, రేణుకుంట్ల ప్రీతం, రాణవేని సుధీర్‌కుమార్, దబ్బెట గోపీకృష్ణ, బూసారపు రాజు, ఎలకలపల్లి సురేశ్, వినయ్, కరీం, గౌస్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు అండగా సురక్ష బీమా యోజన

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: ప్రధానమంత్రి జీవన జ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలు ఖాతాదారులకు అండగా ఉంటాయని గోదావరిఖనిలోని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ సుద్దాల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బ్యాంకులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేనేజర్ మాట్లాడారు. కేడీసీసీ బ్యాంకు ఖాతాదారుడైన భోగరాజు, ప్రధానమత్రి జీవనజ్యోతి, పీఎం సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ చేయించుకున్నాడు. ఇటీవల భోగరాజు గుండెపోటుతో మృతి చెందగా, ఆయన నామినీ అయిన నాగమణికి రూ.2లక్షల చెక్కును బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ అందజేశారు. ప్రతి



చెక్కు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

ఒక్కరూ ఇన్సూరెన్స్ చేయించుకోవడానికి ముందుకు రావాలని మేనేజర్ కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కీర్తన, శ్రీనివాస్, శివ, రమాదేవి, రవళి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి



పరామర్శిస్తున్న కందుల సంధ్యారాణి

గోదావరిఖని: కల్తీ కల్లు మూలంగా రెండు కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయాయని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి అన్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో నవీన్, రమేశ్ అనే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే పారిశ్రామిక ప్రాంతంలో కొంతమంది అక్రమార్కులు అడ్డదారిన డబ్బులు సంపాదించేందుకు కల్తీలను తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై అధికారులు దృష్టిసారించాలన్నారు. బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ భవన నిర్మాణ స్థలాల పరిశీలన

ధర్మారం: మండలంలోని కటికెనపల్లిలో నిర్మించనున్న ప్రభుత్వ భవన నిర్మాణ స్థలాలను శుక్రవారం తహసీల్దార్ రజిత పరిశీలించారు. గ్రామానికి మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్, పల్లె దవాఖాన, మహిళా స్వశక్తి సంఘం భవన నిర్మాణాలకు ప్రభుత్వ స్థలాలను కేటాయించారు. గ్రామ శివారులోని సర్వేనెంబర్ 1255లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, సర్వేనెంబర్ 253 సర్వేనెంబర్‌లో పల్లె దవాఖాన, స్వశక్తి సంఘ భవన నిర్మాణాలకు స్థలం అనుకూలంగా ఉందని తహసీల్దార్ అభిప్రాయపడ్డారు. ఈ స్థలాల్లో భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చేందుకు ఎలాంటి అభ్యంతరం లేద



పరిశీలిస్తున్న తహసీల్దార్, సర్వేయర్

న్నారు. మండల రెవెన్యూ అధికారి రమ్య, సర్వేయర్ నరేశ్, ఉపసర్పంచు గంగారెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రేండ్ల నరేశ్, బోనగిరి శ్రీనివాస్, అజయ్, కట్ట శ్రీహరి పాల్గొన్నారు.

స్వచ్ఛ శుక్రవారం

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో శుక్రవారం స్వచ్ఛశుక్రవార్ కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డులో మురుగు కాలువలను శుభ్రం చేశారు. చెత్త, చెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. అక్కడక్కడా ఉన్న కచ్చాకాలువలకు డ్రైనేజీలను నిర్మించే పనులు చేపట్టకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారుల మధ్య సమన్వయ లోపంతో పనులు



పనులను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్ భాగ్యలక్ష్మి

ముందుకు సాగడం లేదన్నారు. హెల్త్ అసిస్టెంట్ సంపత్, కరుణాకర్, ఎల్లమ్మ, రాజు ఉన్నారు.

సమ్మక్క–సారక్క జాతర కమిటీ అధ్యక్షుడిగా శంకర్

కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో జరిగే సమ్మక్క–సారక్క జాతర కమిటీ అధ్యక్షుడిగా పిడుగు శంకర్‌ను ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే జాతర కమిటీని గ్రామస్తులు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసుకొని ఎన్నుకున్నారు. గౌవర అధ్యక్షులుగా సర్పంచ్ ఆకుల ఓదెలు, ఎంపీపీ రాసకొండ లక్ష్మి, పిడుగు నర్సయ్య, చంద్రమౌళి, అనురాధ, చంద్రయ్య, గట్టయ్యతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.



ఎన్నికైన కమిటీ సభ్యులు

సంక్షిప్త వార్తలు

✦ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: పీజీ సెంటర్ విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈలు కొలిపాక మహిపాల్‌రెడ్డి, పెద్దపల్లి కిషన్ తెలిపారు. మార్కండేయకాలనీ, అశోక్‌నగర్, గణేశ్ నగర్, దుర్గానగర్, అమృతరాజ్ ఫంక్షన్‌హాల్ పరిధి, అలాగే శ్రీనివాస థియేటర్ ఏరియా, మార్వాడి స్ట్రీట్, కల్యాణ్‌నగర్, మేదరిబస్తీ, శివాజీనగర్, లక్ష్మీనగర్ ఏరియాల్లో విద్యుత్ 11కేవీ విద్యుత్‌తీగల చెట్ల కొమ్మలు తొలగించడం దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

అంతర్గాం మండల పరిధిలో..

రామగుండం: అంతర్గాం మండల పరిధిలో ఆకెనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎన్‌పీడీసీఎల్ ఏఈ శంకర్ తెలిపారు. అంతర్గాం మండల పరిధిలో 12 గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

✦ పిచ్చిమొక్కల తొలగింపు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట వద్దగల ఎల్లమ్మతల్లి ఆలయ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను, ముళ్లపొదలను శుక్రవారం తొలగించారు. గౌడ సంఘం నాయకులు సురేశ్‌గౌడ్, తిర్రి సుధాకర్ తదితరుల పర్యవేక్షణలో పనులు నిర్వహించారు.

✦ మంథనిలో భాగవత సప్తాహం

మంథని: పట్టణంలోని పెంజేరు కట్టకు చెందిన దగం లింగయ్య నివాసంలో ఈ నెల 23వరకు మంగళంపల్లి వేణుగోపాలశర్మ గారితో భాగవత సప్తాహం, కొల్లారపు వెంకటరాజంతో పారాయణ సప్తాహం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దాగం రామకృష్ణయ్య కుటుంబ సభ్యులు కోరారు.

✦ ఘనంగా కలశ మహా శోభాయాత్ర

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ ఫర్టిలైజర్ సిటీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అయోధ్య పూజిత అక్షింతల మహాసభ యాత్రను శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ఆధ్వర్యంలో శుక్రవారం మహాకలశ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారం జీఎం సుధీర్‌కుమార్ ఝా శోభాయాత్రలో పాల్గొన్నారు. అర్చకులు పవన్‌కుమార్ ఆచార్యులు, సోమారపు లావణ్యఅరుణ్‌కుమార్, అజయ్, వెంకటి, శ్యామల, నర్సింగరావు, పారిజాతం, సత్యనారాయణ పాల్గొన్నారు.

✦ వైకుంఠధామాల విద్యుద్దీకరణకు నిధులు

జూలపల్లి: మండలంలో ఎనిమిది గ్రామాల్లోని వైకుంఠధామాల విద్యుద్దీకరణ పనులకు నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో వేణుగోపాలరావు తెలిపారు. అబ్బాపూర్, బాలరాజుపల్లె, కీచులాటపల్లె, చీమలపేట, వడ్కాపూర్, వెంకట్రావుపల్లె, పెద్దాపూర్, నాగులపల్లె గ్రామాలకు రూ.17.19లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. కాగా త్వరలోనే విద్యుత్ లైన్ల పనులు ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

✦ 27న మండల సర్వసభ్య సమావేశం

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో 27న శనివారం ఉదయం 11గంటలకు ఎంపీపీ కునారపు రేణుకదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హాజరవుతారని, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పకుండా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

✦ మాజీ ఉపసర్పంచ్ నేత్రాలు సజీవం

ఓదెల: ఓదెల మాజీ ఉపసర్పంచ్ క్యాతం రాజేశం (85) మృతిచెందగా అతని కళ్లను శుక్రవారం దానం చేశారు. రాజేశం కళ్లు మరో ఇద్దరి అంధులకు చూపునిస్తారని కుటుంబసభ్యులకు సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బీష్మాచారి అవగాహన కల్పించారు. మృతుడి కుటుంబసభ్యులు స్పందించగా వాళ్ల అనుమతి మేరకు ఎల్‌వీపీ కరీంనగర్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ గాజుల సతీశ్.. నేత్రాలను సేకరించి ఐ బ్యాంకుకు పంపించారు.

✦ దరఖాస్తుల ఆహ్వానం

జ్యోతినగర్: తెలంగాణ రెసిడెన్షియల్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 2024–25కు గాను ఐదో తరగతిలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం నర్రాశాలపల్లె సమీపంలోని సింధూర ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేయాలని సూచించారు.

✦ ఫోన్ అప్పగింత

రామగిరి: రామగిరి పోలీసుస్టేషన్ పరిధిలోని నాగేపల్లి గ్రామానికి చెందిన పోలు మధుకర్ తన ఫోన్ పోవడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా శుక్రవారం బాధితుడికి ఎస్సై రవిప్రసాద్ అందజేశారు.

ఎల్‌వోసీ అందజేత

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లికి చెందిన శ్రీజ కుమారుడు బొంత ఆకాష్(5) అనారోగ్య సమస్యలతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి బాబుకు యూరినరీ సమస్య ఉందని రెండుసార్లు సర్జరీ చేయాలన్నారు. చికిత్స కోసం రూ.3లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. ఆర్థిక స్తోమత లేకపోడంతో శ్రీజ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌ను సంప్రదించగా బాధితులను స్వయంగా హైదరాబాద్‌కు తీసుకెళ్లి మంత్రి శ్రీధర్‌బాబుకు విషయం వివరించారు. స్పందించిన మంత్రి నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి వైద్యానికి ప్రభుత్వం ఎల్‌వోసీ ద్వారా రూ.లక్ష వరకు మంజూరు చేయించారు. శుక్రవారం మంత్రి వ్యక్తిగత సహాయకుడు సచిన్ ద్వారా ఆసుపత్రిలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు.

రఘువర్ధన్‌రావు సేవలు మరువలేనివి

జూలపల్లి: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పుల్లూరి రఘువర్ధన్‌రావు మండల అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని వైస్ ఎంపీపీ మొగురం రమేశ్ అన్నారు. మండలంలోని వడ్కాపూర్‌లో శుక్రవారం రఘువర్ధన్‌రావు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ ఎర్రోల్ల రాములు, నాయకులు లింగయ్య, కనుకయ్య, లక్ష్మన్, రవీందర్, పాషా, తిరుపతి, రాంనారాయణ, రాజేశ్, రేశవేని ఐలక్క పాల్గొన్నారు.

బోరు మోటార్‌ను పునరుద్ధరించాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ దళిత కాలనీలో బోరు మోటార్‌ను పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం పలువురు నిరసన తెలిపారు. ఎస్సీ కాలనీలో మూడునెలల క్రితమే



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

బోరు మోటార్ పాడవడంతో పంచాయతీ సిబ్బంది పునరుద్ధరిస్తామని మోటారు తీసుకెళ్లి ఇంకా బిగించలేదు. దీనిపై పలుమార్లు ఎంపీడీవో యాదగిరి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం జరగలేదని వారు వాపోయారు. ఇప్పటికైనా సత్వరమే మోటార్‌ను పునరుద్ధరించి తాగునీటి సమస్య తీర్చాలని నిరసన తెలిపారు. వీరికి సామాజిక కార్యకర్త నిమ్మరాజుల రవి అధ్యక్షత వహించగా మహిళలు గుర్రం రాయలింగు, ఇరికిళ్ల లచ్చమ్మ, ఎల్కటూరి తిరుపతమ్మ, సుందిళ్ల నాగజ్యోతి, గాలి రాజేశ్వరి, దేవమ్మ, ఇరికిళ్ల రాజమ్మ ఉన్నారు.

బిల్లుల బకాయిలపై ఆందోళన

- పదిరోజుల్లో ముగియనున్న సర్పంచ్‌ల పదవీకాలం

రామగుండం: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆరునెలలుగా బిల్లులు మంజూరు కాలేదు. మరో పదిరోజుల్లో సర్పంచుల పదవీకాలం ముగియనుంది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో సాధారణ ఫండ్, ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై సర్పంచుల్లో ఆందోళన నెలకొంది. అంతర్గాం మండల పరిధిలో రూ.27.65లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

బిల్లులు చెల్లించాలి

జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీకాలం



లింగాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

ముగియనుండడంతో ఈలోగా గ్రామాల వారీగా ఉన్న పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. గ్రామాల అభివృద్ధి కోసం పలువురు సర్పంచులు సొంత నిధులు వెచ్చించారు.

– బాదరవేణి స్వామి, అంతర్గాం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు

సినిమాలో విలన్ల పేర్లను వెంటనే తొలగించాలి

గోదావరిఖనిటౌన్: సూపర్ స్టార్ మహేశ్‌బాబు నటించిన గుంటూరు కారం సినిమాలో విలన్లకు పెట్టిన మార్క్స్, లెనిన్ పేర్లను వెంటనే తొలగించి, దర్శక నిర్మాతలు క్షమాపణ చెప్పాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొంటు సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రధాన చౌరస్తాలో సినిమా పోస్టర్‌లను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, సురేశ్, హమీదా, కల్పన, ప్రవీణ్, సాగర్, కృష్ణ, శివ, సతీశ్, మహేశ్, రజిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.